నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 10 ఏప్రిల్ 2025 | NIZAMABAD

### నాడు పురోగమనం..
# నేడు తిరోగమనం

- కేసీఆర్ పాలనలో తెలంగాణ నంబర్ వన్
- ఆరు గ్యారెంటీలను ఐదువందల రోజులైనా అమలు చేయని కాంగ్రెస్ సర్కారు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి వేముల ఆగ్రహం
- ఓరుగల్లు సభకు దండెత్తి రావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రామారెడ్డి(సదాశివనగర్), ఏప్రిల్ 9: కేసీఆర్ పాలనలో రాష్ట్రం పురోగమించిందని, ప్రస్తుతం తిరుగోమన దిశగా సాగుతున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దండెత్తి రావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. సదాశివనగర్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి మాట్లాడారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే నంబర్ వన్‌గా ఉంటే ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో 11వ స్థాయి దిగజారిందని విమర్శించారు. జీఎస్‌డీపీలో మూడో స్థానంలో ఉండగా.. 14వ స్థానానికి చేరిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలు అనుసరించాయని గుర్తుచేశారు. కేసీఆర్ 15 ఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాడని చెప్పారు. స్వరాష్ట్రంలో కరెంటు, నీటి గోస లేకుండా చేశాడని తెలిపారు. నీటి కోసం మహిళలు కిలోమీటర్ల దూరం నడిచే బాధను తప్పించి, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధ జలాలను అందించారన్నారు. రాష్ట్రంలో కేవలం 70లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి ఉన్న వరి ధాన్యం.. కేసీఆర్ అందించిన సాగునీటి వనరులతో రెండు లక్షల 70వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందని చెప్పారు. ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతు పండించిన ప్రతి గింజనూ కొన్నారని, డబ్బులు వెంటనే రైతు బ్యాంకు ఖాతాలో జమ చేశారని గుర్తుచేశారు. వరి నాట్ల కోసం కేసీఆర్ రైతు బంధు డబ్బులు వేస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఎన్నికలు వస్తేనే రైతు బంధు డబ్బులు ఇస్తున్నాడని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో పూర్తిచేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలను అధికారం చేపట్టి 500 రోజులైనా ఇంకా అమలుచేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను కూడా ముందుకు తీసుకెళ్లలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భూములు అమ్మి, డబ్బులు దాచుకొనే పనిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారన్నారు.

**వరంగల్ సభకు తరలిరావాలి..**

తెలంగాణ కోసం బీఆర్ఎస్ పుట్టిందని, 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో నిర్వహించనున్న రజతోత్సవ వేడుకలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసేలా సభలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. వాల్ పోస్టర్లు, వాల్ పెయింటింగ్‌లు రాయించాలన్నారు. సభకు తరలివెళ్లే ముందు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. సమావేశంలో సమాశివనగర్ మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, గాంధారి ఏఎంసీ మాజీ చైర్మన్ సాయినేని సత్యంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింహులు, రామారెడ్డి మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, తాడ్వాయి సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోన్‌గొప్పులలో రోడ్డుపై బైఠాయించిన రైతులు(ఫైల్)



- నిర్వాహకుల మాయాజాలం
- బస్తాకు 2 కిలోల చొప్పున అదనంగా సేకరణ
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ యంత్రాంగం..
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- కోటగిరి, గోన్‌గొప్పులలో రైతుల ధర్నా
- దోపిడీని నివారించాలని డిమాండ్

# తరుగు దోపిడీ

కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు

**యాసంగి పంట సేకరణ** కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు దోపిడీకి గురవుతున్నారు. రైతులకు ఎలాంటి నష్టమూ వాటిల్లకుండా, ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. పంటను అమ్ముకోవడానికి ధాన్యం తీసుకురాగా.. తరుగు పేరిట దోచుకుంటున్నారు. క్వింటాలు ధాన్యానికి సుమారు 5 నుంచి 6 కిలోల వరకు తరగు పేరిట అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు. ఈ దోపిడీని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో రైతులు మంగళవారం రోడ్డెక్కారు. స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తరుగు దోపిడీని నివారించాలంటూ ఆందోళన చేయడం.. ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలను ఎత్తిచూపినట్లయ్యింది.

–నిజామాబాద్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**యాసంగిలో** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, కొనుగోలు కేంద్రాలను కూడా విరివిగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ఊదరగొడుతున్నారు. కానీ ధాన్యం రాకను అనుసరించి కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వ యంత్రాంగంలో సమన్వయం పూర్తిగా లోపించింది. బస్తాకు అదనంగా రెండు కిలోలు చొప్పున ధాన్యాన్ని అదనంగా తూకం వేస్తున్నారు. లేదంటే కొనుగోళ్లకు ససేమిరా అంటున్నారు. ధాన్యం దోపిడీకి రైతులు ఒప్పుకోకపోతే బలవంతంగానైనా దోపిడీకి కేంద్రం నిర్వాహకులు పాల్పడుతున్నారు. వడ్లు పచ్చిగా ఉన్నాయంటూ కొర్రీలు పెడుతూ తూకం వేయడానికి సతాయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన తొలిరోజు నుంచే ఈ తరహా దందా వెలుగుచూడడం గమనార్హం.

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎక్కడ?**

బీఆర్ఎస్ హయాంలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టారు. యంత్రాంగాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండడంతోపాటు పొరపాట్లపై సమీక్షలు నిర్వహించేది. కానీ ఇప్పుడు అలాంటిదేమీ కనిపించడం లేదు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఎలాంటి ఫలితమూ లేకుండా పోయింది. ధాన్యం కొనుగోళ్లకు ముందు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తిరిగి ఇటువైపు రాలేదు. ఉమ్మడి జిల్లాలో వడగండ్ల వాన, ఈదురు గాలులు, అకాల వర్షంతో పంట నష్టం సంభవించినప్పటికీ కనీసం ఆరా తీయకపోవడం గమనార్హం. కొనుగోళ్లు మొదలైనప్పటికీ ఉభయ జిల్లాలకు చెందిన యంత్రాంగంతో సమీక్షలు చేయకపోవడంతో ఈ తరహా లోపాలు బయట పడుతున్నాయి.

**సిండికేట్‌గా మారిన మిల్లర్లు..**

తరుగు దోపిడీకి రైస్ మిల్లర్లు సిండికేట్‌గా మారారు. అంతా కలిసి ఒక నిర్ణయం తీసుకుని రైతులను నిండా ముంచుతున్నారు. గతంలో మాదిరిగానే బహిరంగంగానే 40 కిలోల బస్తాకు 2 నుంచి నాలుగు కిలోల చొప్పున తరుగు రాబడుతున్నారు. ఈసారి సన్న వడ్ల సాగు 70 శాతం వరకు పెరిగింది. యాసంగిలో వచ్చే ధాన్యాన్ని మర ఆడిస్తే బియ్యంలో నూకలు ఎక్కువగా వస్తాయి. ఇదే సాకును బూచీగా చూపి రైస్ మిల్లర్లు దోపిడీకి తెగబడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మిల్లర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి రైతులకు చెల్లింపులు జరిగేలా వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. కింటాలు ధాన్యానికి సుమారు 5 నుంచి 6 కిలోల వరకు తరుగు పేరిట పక్కాగా దోపిడీ జరుగుతున్నది.

దీంతో రైతులకు క్వింటాలుకు రూ.120 నుంచి రూ.150 వరకు నష్టం వాటిల్లుతున్నది. ఎకరం భూమి కలిగి ఉన్న రైతుకు దాదాపుగా రూ.3 వేల నుంచి రూ.4వేలు నష్ట పోవాల్సి వస్తున్నది. బాన్సువాడ, బోధన్, జుక్కల్ నియోజకవర్గాల్లో ఏటా అందరికన్నా ముందే కోతలు ప్రారంభిస్తారు. నిజాంసాగర్ ఆయకట్టు రైతులంతా అందరికన్నా ముందుగానే పంటను విక్రయిస్తారు. ఇక్కడ మొదలైన దోపిడీ పర్వం ఏకంగా ధాన్యం కొనుగోళ్లు ముగిసేంత వరకు కొనసాగుతున్నది. ఈ దోపిడీ తంతు బహిరంగంగానే జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదేందని అడిగితే స్పందించే వారు కూడా లేకుండా పోయారు. కోటగిరి రైతుల ఆందోళనతో వెలుగు చూసిన రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల దోపిడీకి చెక్‌పెట్టి కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని కర్షకులు డిమాండ్ చేస్తున్నారు.

గోన్‌గొప్పులలో రైతులను సముదాయిస్తున్న పోలీసులు (ఫైల్)





కోటగిరి తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు(ఫైల్)

**దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు**

ధాన్యం రైతులను వ్యాపారులు, దళారులు సైతం నిలువునా దోచేస్తున్నారు. యాసంగి పంటను అమ్ముకునేందుకు రైతులు సిద్ధమవుతున్నా, కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మద్దతు ధర కన్నా తక్కువకే అమ్ముకుంటున్నారు. క్వింటాలుకు రూ.2వేల లోపే చెల్లిస్తూ వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారు. నిజామాబాద్‌లోని ధాన్యాన్ని నల్లగొండ, మిర్యాలగూడ, ఏపీకి చెందిన మిల్లర్లు దళారుల ద్వారా దోచుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,300, 'బీ' గ్రేడ్ రకానికి రూ.2,320 ధర నిర్ణయించగా.. దళారులు మాత్రం కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదు. ధాన్యానికి డబ్బులు చెల్లించే సమయంలో రూ.లక్షకు రూ.వెయ్యి చొప్పున కోత విధిస్తున్నట్లు తెలుస్తున్నది. వ్యాపారుల మోసాలు వెలుగు చూస్తుండగా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది.

### 30మందికి అస్వస్థత
### ఆరుగురి పరిస్థితి విషమం
### కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స

# గౌరారంలో కల్తీ కల్లు కలకలం



కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న కల్తీ కల్లు బాధితులు



కల్లును పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

కామారెడ్డి, ఏప్రిల్ 9: బాన్సువాడ డివిజన్‌లో కల్తీ కల్లు ఘటన మరువక ముందే మరోసారి గాంధారి మండలంలో 'కల్తీ' కలకలం రేపింది. గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా కల్లు తాగిన గ్రామానికి చెందిన 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఆరుగురు సీరియస్‌గా ఉన్నారు. బాధితులను కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి, చికిత్సలు అందిస్తున్నారు. అంకోల్ తండాకు చెందిన సత్తవ్వ ఐసీయూలో చికిత్స పొందుతున్నది. అంకోల్ తండాకు చెందిన బుజ్జి, గౌరారం గ్రామానికి చెందిన కేశవ్వ, లాలు, మహమూద్, మీరాబాయి, సౌందర్య, దుర్కి గ్రామానికి చెందిన సాయిబాబా ఐసోలేషన్ వార్డులో ఉన్నారు. కల్తీ కల్లు తాగడంతో తమవారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కల్లు విక్రయిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుల బంధువులు డిమాండ్ చేశారు.

**గౌరారం గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి..**

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 9: కల్తీ కల్లు ఘటనపై గౌరారం గ్రామాన్ని కామారెడ్డి జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ బుధవారం సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పలు ఇండ్లలో ఉన్న కల్లును వైద్య సిబ్బంది పారబోయించారు. మెడికల్ ఆఫీసర్ సాయికుమార్ ఉన్నారు.

**బాధితులు 89మంది..**

బాన్సువాడ/ నస్రుల్లాబాద్, ఏప్రిల్ 9: కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ, గాంధారి మండలాల్లో మొత్తం 89మంది కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై దవాఖానల్లో చేరారని డీసీహెచ్‌ఎస్, బాన్సువాడ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ విజయలక్ష్మి బుధవారం తెలిపారు. బాధితుల్లో 12 మంది డిశ్చార్జి కాగా.. 77మంది పలు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. బాన్సువాడ ప్రభుత్వ ఏరియా దవాఖానలో 63 మంది చేరగా.. 10మంది డిశ్చార్జి అయ్యారని తెలిపారు. నిజామాబాద్‌కు తరలించిన వారిలో 13 మంది ప్రభుత్వ దవాఖానలో, ఒకరు ఎమ్మార్ దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పది మంది కల్తీకల్లు బాధితులు ఉన్నారని తెలిపారు. కల్తీ కల్లు విక్రయించిన కేసులో నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన ఉడతల లక్ష్మాగౌడ్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్ తెలిపారు.

### 15న రూరల్, 16న బాన్సువాడ, బోధన్‌లో
## బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

**రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**



ఖలీల్‌వాడి/ బాన్సువాడ, ఏప్రిల్ 9: వరంగల్‌లో ఈనెల 27వ నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం జిల్లావ్యాప్తంగా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీన రూరల్ నియోజకవర్గంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. నేడు(గురువారం) బాన్సువాడ, బోధన్‌లో నిర్వహించనున్న సన్నాహక సమావేశాలు వాయిదా పడినట్లు తెలిపారు. ఈ రెండు సమావేశాలను ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సన్నాహక సమావేశాలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.





## సభను సక్సెస్ చేయాలి

**గంప, షిండేతో వేముల సమాలోచనలు**

కామారెడ్డి/బాన్సువాడ, ఏప్రిల్ 9: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేతో బుధవారం కామారెడ్డిలో వేర్వేరుగా సమావేశమయ్యారు. కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు కార్యాచరణ రూపొందించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పెద్ద సంఖ్యలో తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

# సిలిండర్ ధర పెంపుపై మిన్నంటిన నిరసనలు



నాగారంలో కట్టెల పొయ్యిపై వంట చేసి, నిరసన తెలుపుతున్న మహిళలు

ఖలీల్‌వాడి/ బోధన్/ ధర్పల్లి(సిరికొండ)/ ఆర్మూర్ టౌన్/ కంఠేశ్వర్, ఏప్రిల్ 9: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచడంపై జిల్లావ్యాప్తంగా బుధవారం నిరసనలు మిన్నంటాయి. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తున్నదని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ అధికారం చేపట్టిన మొదట్లో రూ.నాలుగు వందలు ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు వెయ్యి రూపాయలు దాటిందని ఆవేదన వ్యక్తంచేశారు. పెంచిన ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిజామాబాద్‌లోని ధర్నా చౌక్‌లో సీపీఐ నాయకులు గ్యాస్ బండను మోస్తూ నిరసన వ్యక్తంచేశారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ కేవలం రూ.45 మాత్రమే ఇస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిలిండర్ ధర పెంచడంతో పేదలకు భారంగా మారిందన్నారు. బోధన్‌లో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించారు. సిరికొండలో పీవోడబ్లూ ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ.. బీజేపీ సర్కారు తీరుపై మండిపడ్డారు. ఆర్మూర్‌లో సీపీఎం నాయకులు గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో నాగారంలోని గోశాల వద్ద రోడ్డులో కట్టెల పొయ్యిపై వంట వండుతూ నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రోజురోజుకూ ప్రజలపై మోయలేని భారం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.




సిరికొండలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు